నమస్తే తెలంగాణ
సంగారెడ్డి
I | హైదరాబాద్, శనివారం 30 నవంబర్ 2024 | SANGAREDDY

సిద్దిపేటలో తెలంగాణ తల్లి విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న హరీశ్‌రావు, కొత్త ప్రభాకర్‌రెడ్డి, యాదవరెడ్డి, బీఆర్ఎస్ నాయకులు


రంగధాంపల్లి చౌరస్తాలో అమరవీరుల స్తూపం వద్ద నివాళులర్పిస్తున్న హరీశ్‌రావు, నాయకులు

తెలంగాణ తల్లికి పుష్పాభిషేకం

సిద్దిపేట/సిద్దిపేట అర్బన్, నవంబర్ 29: సిద్దిపేట పట్టణంలో శుక్రవారం దీక్షా దివస్ కార్యక్రమం నిర్వహించారు. సిద్దిపేట శివారులోని పొన్నాల వద్ద బీఆర్ఎస్ జిల్లా కార్యాలయంలో పార్టీ జిల్లా అధ్యక్షుడు కొత్త ప్రభాకర్ రెడ్డి ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ఎమ్మెల్యే హరీశ్ రావు, ఎమ్మెల్సీ యాదవ రెడ్డి, ఎఫ్‌డీసీ మాజీ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి, రాష్ట్ర కార్యదర్శి రాధాకృష్ణ శర్మ, భూపతి రెడ్డి, మనోహర్ రావు, కర్ర శ్రీహరి, నాయకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ కార్యకర్తల కుటుంబాలకు పార్టీ నుంచి బీమా చెక్కులు అందజేశారు. అంతకు ముందు ప్రశాంత్ నగర్‌లోని తెలంగాణ తల్లి విగ్రహానికి పూలమాల వేశారు. సిద్దిపేటలోని రంగధాంపల్లి చౌరస్తా వద్ద అమరవీరుల స్తూపం వద్ద పూలుచల్లి అమరులకు నివాళులర్పించారు. పొన్నాల వద్ద బీఆర్ఎస్ కార్యాలయంలో కేసీఆర్ చిత్రపటానికి ఎమ్మెల్యే హరీశ్‌రావుతో పాటు కొత్త ప్రభాకర్ రెడ్డి, యాదవ రెడ్డి, ఇతర నాయకులు క్షీరాభిషేకం నిర్వహించారు. సందర్భంగా ఏర్పాటు చేసిన ఫొటో ఎగ్జిబిషన్‌ను తిలకించి నాటి ఉద్యమ స్మృతులను గుర్తు చేసుకున్నారు. కార్యక్రమం అనంతరం కార్యకర్తలకు హరీశ్‌రావు స్వయంగా భోజనం వడ్డించారు. వచ్చిన కార్యకర్తలతో కలిసి సెల్ఫీలు దిగారు.

కార్యకర్తల కుటుంబాలకు జీవిత బీమా చెక్కులు అందజేస్తున్న ఎమ్మెల్యేలు తన్నీరు హరీశ్‌రావు, కొత్త ప్రభాకర్ రెడ్డి

పాళ్లేవో.. నీళ్లేవో తెలిసింది

- దీక్షా దివస్ స్ఫూర్తితో కాంగ్రెస్ ప్రభుత్వంపై పోరాడుదాం..
- సిద్దిపేట సభనే ఆమరణ దీక్షకు పునాది
- దీక్షా దివస్‌లో మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు
- భారీగా తరలివచ్చిన గులాబీ శ్రేణులు

దొంగలను మళ్లీ పార్టీ గుమ్మం తొక్కనీయం.. త్యాగాలు, పోరాటాలతో తెలంగాణ తెచ్చుకున్నాం

సిద్దిపేటలో దీక్షా దివస్ కార్యక్రమంలో పాల్గొన్న జిల్లా నాయకులు

మాట్లాడుతున్న మాజీ మంత్రి, ఎమ్మెల్యే తన్నీరు హరీశ్‌రావు

సిద్దిపేట అర్బన్, నవంబర్ 29: తెలంగాణ మలిదశ ఉద్యమంలో బీఆర్ఎస్ పార్టీలో అనేక మంది చేరారని, వారిలో కొందరు పార్టీకి ద్రోహం చేసి బయటకు వెళ్లారని, ఇప్పుడు పాళ్లేవో.. నీళ్లేదో తెలిసిందని, పార్టీని వీడిన దొంగలను మళ్లీ గులాబీ పార్టీ గుమ్మం కూడా తొక్కనీయమని మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు అన్నారు. శుక్రవారం సిద్దిపేట జిల్లాకేంద్రంలో ఏర్పాటు చేసిన దీక్షాదివాస్ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ.. దీక్షాదివాస్ కార్యక్రమం చూస్తుంటే ఉద్యమ జ్ఞాపకాలు గుర్తుకు వచ్చాయన్నారు. కేసీఆర్ పదవుల గురించి ఆలోచించి ఉంటే తెలంగాణ రాష్ట్రం వచ్చేది కాదన్నారు. సిద్దిపేటలో జరిగిన ఉద్యోగ గర్జన సభ సన్నాహక సమావేశంలో అవసరమైతే తెలంగాణ కోసం ఆమరణ దీక్షకు దిగుతానని కేసీఆర్ ప్రకటించిన విషయాన్ని హరీశ్‌రావు గుర్తు చేశారు. అక్టోబర్ 21, 2009న సిద్దిపేటలో టీఎన్‌జీవో అధ్యక్షుడు స్వామిగౌడ్, టీఎన్‌జీవో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దేవీప్రసాద్ ఆధ్వర్యంలో లక్షలాది మంది ఉద్యోగులతో అద్భుతమైన ఉద్యోగ గర్జన సభ నిర్వహించుకున్నట్లు గుర్తు చేశారు. తదనంతరం కేసీఆర్ సిద్దిపేట వేదికగా నవంబర్ 29న ఆమరణ దీక్షకు పూనుకున్నాడని.. ఆ క్రమంలో అల్గునూరు వద్ద కేసీఆర్‌ను అదుపులోకి తీసుకొని ఖమ్మం జైలుకు తరలించారన్నారు. కేసీఆర్‌ను ఖమ్మంకు తరలిస్తే ఉద్యమం చల్లారుతుందని నాటి ముఖ్యమంత్రి రోశయ్య అనుకున్నారని.. కానీ ఖమ్మం జైలు వద్దకు పెద్ద ఎత్తున ఉద్యోగులు, లాయర్లు, విద్యార్థులు, నాయకులు వచ్చారన్నారు. ఖమ్మం జైలులో కేసీఆర్‌తో పాటు కెప్టెన్ లక్ష్మీకాంతరావు, నాయిని నరసింహారెడ్డి, రాజయ్య లాంటి వాళ్లను కూడా అరెస్ట్ చేసి ఖమ్మం జైలుకు తరలించారన్నారు. అపుడు తాము రంగధాంపల్లిలో తాము దీక్షకు పూనుకున్నామని.. కానీ, తమను అరెస్ట్ చేసి వివిధ జైళ్లకు తరలించారని హరీశ్‌రావు గుర్తు చేశారు. నాడు గ్రామాల నుంచి ప్రజలను బయటకు రానియ్యని పరిస్థితి అన్నారు. సిద్దిపేటలో ఎటు చూసినా పోలీసోల్లే ఉన్నారని.. అయినా కొన్ని వేల మంది దీక్షాస్థలికి వచ్చారన్నారు. ఎన్ని కేసులు పెట్టినా పోరాటం కొనసాగించామన్నారు. సిద్దిపేట పాత బస్టాండ్ వద్ద దీక్షా శిబిరాన్ని ప్రారంభించి 1531 రోజులు దీక్ష కొనసాగించినట్లు తెలిపారు. జూన్ 2, 2014న గెజిట్ నోటిఫికేషన్ వచ్చే వరకు దీక్షా శిబిరాన్ని నడిపించామన్నారు. ఒక రోజు కాదు.. రెండు రోజులు కాదు.. నాలుగు సంవత్సరాలకు పైగా దీక్షా శిబిరాన్ని నడిపించామన్నారు. కొన్ని వందల మంది దీక్షా స్థలిని నడిపించారని.. ఎంతో మంది మహిళలు దీక్షలో పాల్గొన్నారని గుర్తుచేశారు. తెలంగాణ ఉద్యమం ఎంతో గొప్ప చరిత్ర కలిగిందని, ఎంతోమంది విద్యార్థుల త్యాగాలు, కేసీఆర్ ఆధ్వర్యంలో శాంతియుత పోరాటంతో తెలంగాణ రాష్ట్రాన్ని సాధించినట్లు తెలిపారు. తెలంగాణ రాష్ట్రానికి కేసీఆర్, బీఆర్ఎస్‌కు ఉన్నంత ప్రేమ ఏ పార్టీకి ఉండదని.. చావు నోట్లో తల పెట్టి, కొట్లాడి తెలంగాణ తెచ్చామన్నారు. కేసీఆర్ దీక్షా దివస్ స్ఫూర్తితో.. ప్రజా వ్యతిరేక కాంగ్రెస్ ప్రభుత్వాన్ని గద్దె దించేదాక అందరం ఒక్కటై కొట్లాడుదామని సంకల్పం తీసుకుందామని హరీశ్‌రావు పిలుపునిచ్చారు. లగచర్లలో కొట్లాడింది బీఆర్ఎస్ అని.. హైడ్రాలో కొట్లాడింది బీఆర్ఎస్ అని.. ఇదే విధంగా రైతుల పక్షాన, మహిళలు, విద్యార్థుల పక్షాన, నిరుద్యోగుల పక్షాన ప్రజా వ్యతిరేక నిర్ణయాలు తీసుకుంటున్న కాంగ్రెస్ పైన బీఆర్ఎస్ పార్టీ కొట్లాడుతోందన్నారు. దీక్షా దివస్ స్ఫూర్తితో కొత్త ఉత్సాహంతో, నాటి ఉద్యమ స్ఫూర్తితో ముందుకు సాగి బీఆర్ఎస్ ప్రభుత్వాన్ని తెచ్చుకుందామని హరీశ్‌రావు పిలుపునిచ్చారు.

ఉద్యమ స్ఫూర్తితో పోరాడుదాం

–కొత్త ప్రభాకర్‌రెడ్డి, ఎమ్మెల్యే, బీఆర్ఎస్ జిల్లా పార్టీ అధ్యక్షుడు

స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీ గెలుపు కోసం ప్రతి ఒక్కరం సైనికుల్లా కష్టపడదాం. వచ్చేది మన ప్రభుత్వమే. ప్రతి కార్యకర్తకూ బీఆర్ఎస్ పార్టీ, ఎమ్మెల్యే హరీశ్‌రావు, నేను అండగా ఉంటాం. తెలంగాణ వచ్చుడో.. కేసీఆర్ సచ్చుడో అన్న నినాదంతో తెలంగాణ రాష్ట్రాన్ని సాధించుకున్నాం. కేసీఆర్ సారథ్యంలో తెలంగాణ రాష్ట్రం పదేండ్లలో దేశంలోనే అభివృద్ధిలో అగ్రగామిగా నిలిచింది. కాంగ్రెస్ ఏడాది పాలనలో ఎలాంటి అభివృద్ధి జరగలేదు. కాంగ్రెస్ ప్రభుత్వం బీఆర్ఎస్ కార్యకర్తలను, ఎమ్మెల్యేలను, నాయకులను టార్గెట్ చేస్తూ వేధిస్తున్నది. కేసీఆర్ పాలనే బాగుండేదని ప్రజలు మళ్లీ కోరుకుంటున్నారు. కాంగ్రెస్ అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలపై ఉద్యమ స్ఫూర్తితో పోరాడుదాం.

కేసీఆర్ దీక్షతోనే రాష్ట్రం సాకారం

– యాదవరెడ్డి, ఎమ్మెల్సీ

తెలంగాణ ఉద్యమంలో అత్యంత కీలక ఘట్టం కేసీఆర్ ఆమరణ నిరాహార దీక్ష.. బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ రాష్ట్ర సాధన కోసం చేపట్టిన ఆమరణ దీక్షకు నేటికి 15 ఏండ్లు పూర్తయ్యాయి. నాటి సమైక్యాంధ్ర పాలనలో రైతుల ఆత్మహత్యలు, వలసలు, కరువు, విద్యుత్ చార్జీల పెంపు వంటి అంశాలను చూసి నాటి డిప్యూటీ స్పీకర్‌గా ఉన్న కేసీఆర్ పదవులను, పార్టీని కాదని తెలంగాణ రాష్ట్ర సాధన కోసం మలిదశ పోరాటం ప్రారంభించారు. కేసీఆర్ దీక్ష ఫలితంగానే రాష్ట్ర సాధన జరిగింది. దీక్షా దివస్ స్ఫూర్తితో మోసపూరిత కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ప్రజాక్షేత్రంలో నిలదీద్దాం. సిద్దిపేట గడ్డ.. ఉద్యమానికి అడ్డా. ఇద్దరు పులిబిడ్డలను అందించిన గొప్పగడ్డ.

చరిత్ర పూటల్లో నిలిచిన రోజు

– వంటేరు ప్రతాప్‌రెడ్డి, ఎఫ్‌డీసీ మాజీ చైర్మన్

మలిదశ తెలంగాణ ఉద్యమంలో బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ 29 నవంబర్ 2009లో చేపట్టిన ఆమరణ నిరాహార దీక్ష అత్యంత కీలకమైంది. ఈ దీక్షతో ఢిల్లీ మెడలు వంచి తెలంగాణ రాష్ట్రం సాధించారు కేసీఆర్. తెలంగాణ రాష్ట్రం కోసం అలుపెరుగని పోరాటం చేసిన యోధుడు కేసీఆర్. మనందరికి స్ఫూర్తి ప్రదాత. సాధించిన తెలంగాణ రాష్ట్రాన్ని సీఎంగా బాధ్యతతో పనిచేసి దేశంలోనే అగ్రగామిగా కేసీఆర్ నిలిపారు. అన్నివర్గాల సంక్షేమానికి కృషిచేశారు. ప్రాజెక్టులు కట్టి, ఉచిత కరెంట్ ఇచ్చి, అభివృద్ధి చేసి తెలంగాణను కేసీఆర్ దేశానికి మాడల్‌గా నిలిపారు. కాంగ్రెస్‌ను ఏడాదిలోనే ప్రజలు ఛీ కొడుతున్నారు. కేసీఆర్, హరీశ్‌రావు నాయకత్వంలో స్థానిక సంస్థల ఎన్నికల్లో సత్తాచాటుదాం.


సిద్దిపేటలో నిర్వహించిన దీక్షా దివస్ కార్యక్రమానికి హాజరైన బీఆర్ఎస్ శ్రేణులు

చదువుకు పేదరికం అడ్డుకావద్దు

వైజ్ఞానిక ప్రదర్శనలో విద్యార్థులతో మాట్లాడుతున్న మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు

- వైద్యవిద్య చదివే పేద విద్యార్థులకు సాయమందిస్తా
- సమాజాన్ని మార్చే సామాజిక వేత్తలుగా ఎదగాలి
- సిద్దిపేటలో జిల్లాస్థాయి వైజ్ఞానిక ప్రదర్శనలో ఎమ్మెల్యే హరీశ్‌రావు

సిద్దిపేట, నవంబర్ 29: చదువుకు పేదరికం అడ్డుకావద్దని, నియోజకవర్గంలో వైద్యవిద్య చదివే పేద విద్యార్థులకు ఆర్థిక సహాయాన్ని అందిస్తానని మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు అన్నారు. శుక్రవారం సిద్దిపేటలోని ప్రభుత్వ బాలికల పాఠశాలలో జిల్లా స్థాయి వైజ్ఞానిక ప్రదర్శనకు ఆయన హాజరై తిలకించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యార్థులు సమాజాన్ని మార్చే సామాజిక వేత్తలుగా ఎదగాలన్నారు. ప్రభుత్వ మెడికల్ కళాశాలలో సీటు వచ్చిన విద్యార్థులకు ఫీజు తానే చెల్లిస్తానన్నారు. ఫీజు తన బాధ్యత... డాక్టర్ అయ్యేది మీ బాధ్యత అని ఆయన పేర్కొన్నారు. బాసర ట్రిపుల్ ఐటీలో సీటు సాధించిన విద్యార్థులకు ట్యాబ్ గిఫ్ట్‌గా ఇస్తానన్నారు. అన్నింటిలో సిద్దిపేట ఆదర్శమని.. సైన్స్ ఫెయిర్‌లో రాష్ట్రంలో 1733 ప్రదర్శనలు చేసిన జిల్లాగా సిద్దిపేట నంబర్ వన్‌గా నిలవడం సంతోషంగా ఉంద ని హరీశ్‌రావు పేర్కొన్నారు. సైన్స్ ఫెయిర్‌లో విద్యార్థుల ప్రదర్శనలు ఆకట్టుకున్నాయని, ఒక్కో విద్యార్థిలో ఒక్కో శాస్త్రవేత్త తనకు కనిపించారని అభినందించారు. ఎక్కువగా వ్యవసాయ ఆధారిత ప్రదర్శనలు చేయడం చాలా సంతోషంగా ఉందన్నారు. విద్యార్థులు ఇంగ్లిష్‌లో మాట్లాడటం చాలా సంతోషంగా ఉందని, విద్యార్థులు సోషల్ మీడియాకు , ఫోన్లు, డ్రగ్స్‌కు దూరంగా ఉండి బాగా చదువుకోవాలని సూచించారు. వంద రోజుల్లో పదో తరగతి పరీక్షలు ఉన్నాయని, ఇప్పటి నుంచే టీవీలు, ఫంక్షన్లు, ఫోన్లు బంద్ చేయాలన్నారు. 10/10 సాధించిన విద్యార్థులకు బహుమతి ఇస్తానని హామీ ఇచ్చారు. వైద్య విద్యకు ఎక్కువగా బాలికలు ఆసక్తి చూపుతున్నారన్నారు. పోలీసు ఉద్యోగాల్లో మహిళలకు 33 శాతం రిజర్వేషన్లు కేసీఆర్ కల్పించారని గుర్తుచేశారు. అందరూ అన్ని రంగాల్లో రాణించాలని హరీశ్‌రావు పిలుపునిచ్చారు.

డివైడర్‌పైకి దూసుకెళ్లిన ఆర్టీసీ బస్సు

- తప్పిన ప్రమాదం.. పలువురికి గాయాలు
- సంగారెడ్డి జిల్లా అందోల్ మండలం కన్సాన్‌పల్లి శివారులో ఘటన

క్షతగాత్రులను దవాఖానకు తరలిస్తున్న దృశ్యం

అందోల్, నవంబర్ 29: ప్రయాణికులతో వెళ్తున్న ఆర్టీసీ బస్సు అదుపు తప్పి డివైడర్‌ను ఢీకొనడంతో పలువురు గాయపడిన సంఘటన సంగారెడ్డి జిల్లా అందోల్ మండలంలోని కన్సాన్‌పల్లి శివారులో జరిగింది. ప్రమాదానికి సంబంధించి ఆర్టీసీ కండక్టర్, ప్రయాణికులు తెలిపిన వివరాలు.. నారాయణఖేడ్ డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు శుక్రవారం 55 మంది ప్రయాణికులతో లింగంపల్లి బయలుదేరింది. బస్సు 161 జాతీయ రహదారిపై వెళ్తున్న క్రమంలో కన్సాన్‌పల్లి వద్ద ఒక్కసారిగా అదుపుతప్పి రోడ్డు డివైడర్‌పై దూసుకెళ్లింది. దీంతో ఏం జరుగుతుందో తెలియక ప్రయాణికులు కేకలు వేశారు. డైవర్ సడెన్ బ్రేక్ వేయడంతో బస్సులో ఉన్న ప్రయాణికులు ఒకరిపై ఒకరు పడడంతో కొంతమందికి స్వల్పంగా, మరికొంత మంది తీవ్రంగా గాయపడ్డారు. బస్సు అలాగే ఇంకొంచం ముందుకు వెళ్లి కిందకు పడితే పెద్ద ప్రమాదమే జరిగేదని, డివైడర్‌పై ఆగడంతో ప్రమాదం తప్పిందని ప్రయాణికులు చెప్పారు. నేషనల్ హైవే కావడంతో ప్రమాదం జరిగిన వెంటనే ఇతర వాహనదారులు బస్సులోనుంచి ప్రయాణికులను కిందకు దింపి పోలీసులు, 108కి సమాచారం అందించి సహాయక చర్యలో పాల్గొన్నారు. క్షతగాత్రులను జోగిపేట దవాఖానకు తరలించి చికిత్స అందించారు. ఘటనా స్థలానికి చేరుకున్న జోగిపేట పోలీసులు ప్రమాదానికి గల కారణాలు తెలుసుకున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. బస్సు డ్రైవర్ అతివేగంగా, అజాగ్రత్తగా బస్సు నడపడమే ప్రమాదానికి కారణమని ప్రయాణికులు తెలిపారు.

ఘటనా స్థలంలో వివరాలు సేకరిస్తున్న పోలీసులు

రూ.52 లక్షలతో ఉడాయించిన
చిట్‌ఫండ్ ఉద్యోగి

సంగారెడ్డి, నవంబర్ 29: కస్టమర్లకు సంబంధించిన రూ.52 లక్షల నగదుతో చిట్‌ఫండ్ ఉద్యోగి ఉడాయించిన ఘటన సంగారెడ్డిలో చోటు చేసుకుంది. సంగారెడ్డి పట్టణ సీఐ ఎస్.రమేశ్ వెల్లడించిన వివరాల ప్రకారం.. సంగారెడ్డిలోని కపిల్‌చిట్ ఫండ్స్ రికవరీ సెల్‌లో వరంగల్‌కు చెందిన మహేశ్వర్ అకౌంట్స్ ఆఫీసర్‌గా పనిచేస్తున్నాడు. కస్టమర్ల నుంచి వసూలు చేసిన డబ్బులు కపిల్ చిట్స్‌లో ఖాతాలో జమ అయ్యేలా ఆయన చూస్తారు. ఇటీవల కస్టమర్ల నుంచి వసూలు చేసిన రూ.52 లక్షలను చిట్ కంపెనీ ఖాతాలో జమచేయకుండా గురువారం తీసుకుని పరార్ అయ్యాడు. ఈ విషయాన్ని శుక్రవారం గుర్తించిన చిట్ ఫండ్ సంస్థ సంగారెడ్డి పట్టణ పోలీస్టేషన్‌లో మహేశ్వర్‌పై ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసుకుని విచారణ జరుపుతున్నట్లు పట్టణ సీఐ ఎస్.రమేశ్ తెలిపారు. ఈ విషయం తెలిసి డబ్బులు కట్టిన కస్టమర్లు ఆందోళన చెందుతున్నారు.

పోలీసుల సంక్షేమం ప్రభుత్వ బాధ్యత

– కాడెట్ల అవుట్ పరేడ్ కార్యక్రమంలో మంత్రి శ్రీధర్ బాబు

పోలీస్ అధికారులతో మంత్రి శ్రీధర్ బాబు

అమీన్‌పూర్, నవంబర్ 29: పోలీసుల సంక్షేమం ప్రభుత్వ బాధ్యత అని ఐటీ శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు అన్నారు. అమీన్‌పూర్ మున్సిపాలిటీ పరిధిలోని స్పెషల్ ప్రొటెక్షన్ ఫోర్స్ (టీజీ ఎస్పీఎఫ్) అకాడమీలో శిక్షణ పూర్తి చేసుకున్న 265 మంది క్యాడెట్లకు పాసింగ్ అవుట్ పరేడ్ శుక్రవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆయన హాజరై మాట్లాడుతూ.. కొత్తగా సెలెక్ట్ అయిన క్యాడెట్లు రాష్ట్ర ప్రతిష్టను కాపాడే సంరక్షకులుగా బాధ్యతతో విధులు నిర్వర్తించాలన్నారు. కార్యక్రమంలో టీజీ ఎస్పీఎఫ్ ఐజీ అనిల్ కుమార్, హోం శాఖ స్పెషల్ సెక్రటరీ రవిగుప్తా, పోలీస్ అధికారులు, క్యాడెట్ల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

తహసీల్‌లో రైతు ఆత్మహత్యాయత్నం

తహసీల్దార్ ఛాంబర్‌లో ఆత్మహత్యయత్నానికి పాల్పడుతున్న రైతు కనకరాజు

మద్దూరు(ధూళిమిట్ట), నవంబర్29: తనకు తెలియకుండా తన తండ్రి ఏకపక్షంగా సోదరుల పిల్లలకు భూమిని పట్టా చేస్తున్న విషయాన్ని తెలుసుకున్న ఓ రైతు తహసీల్దార్ ఛాంబర్‌లో తహసీల్దార్ ఎదుట ఆత్మహత్యకు యత్నించాడు. ఈ ఘటన సిద్దిపేట జిల్లా మద్దూరులో శుక్రవారం సాయంత్రం చోటు చేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి.. లద్నూర్ గ్రామానికి చెందిన కాసర్ల రామస్వామికి బాలమల్లు, శ్రీనివాస్, కనకరాజు అనే ముగ్గురు కుమారులు ఉన్నారు. ఇటీవల సోదరుల మధ్య ఆస్తి పంపకాల విషయంలో గొడవలు ఏర్పడ్డాయి. ఈ నేపథ్యంలో రామస్వామి తన పేరిట ఉన్న 1.32 ఎకరాల భూమిని బాలమల్లు, శ్రీనివాస్‌ల కుమారులు భానుచందర్, హరీశ్ పేరు మీద పట్టా చేసేందుకు ధరణిలో స్లాట్‌బుక్ చేశారు. పట్టాకోసం శుక్రవారం వీరంతా తహసీల్ కార్యాలయానికి చేరుకున్నారు. ఈ విషయం తెలుసుకున్న రామస్వామి చిన్నకుమారుడు కాసర్ల కనకరాజు తహసీల్ కార్యాలయానికి చేరుకున్నాడు. తనకు తెలియకుండా తన తండ్రి తన సోదరుల పిల్లల పేరిట అక్రమంగా పట్టా చేసేందుకు యత్నిస్తున్నారని, దీనిని వెంటనే నిలిపివేయాలని తహసీల్దార్ ఛాంబర్‌లోకి మందు డబ్బాతో ప్రవేశించి, తహసీల్దార్ రహీం ఎదుటే ఆత్మహత్యకు యత్నించాడు. ఛాంబర్‌లోని పలువురు కనకరాజును అడ్డుకొని వారించారు. ఈ విషయమై తహసీల్దార్ రామస్వామిని తన ఛాంబర్‌లోకి పిలిపించుకొని మాట్లాడారు. తన ముగ్గురు కుమారులకు సమానంగా తన వద్ద ఉన్న భూమిని పట్టాచేస్తానని అంగీకరించడంతో గొడవ సద్దుమణిగింది. కాగా, వారి రిజిస్ట్రేషన్ ప్రక్రియను నిలిపివేసినట్లు తహసీల్దార్ రహీం తెలిపారు.

చలి పంజా!

- పెరిగిన చలి తీవ్రత
- గజగజ వణుకుతున్న ప్రజలు
- న్యాల్‌కల్‌లో 7.9 డిగ్రీల కనిష్ట ఉష్ణోగ్రత నమోదు

జహీరాబాద్, నవంబర్ 29: ఉత్తర దిశ నుంచి వీస్తున్న శీతల గాలులుతో చలి తీవ్రత రోజు రోజుకు పెరుగుతున్నది. సంగారెడ్డి జిల్లా న్యాల్‌కల్, జహీరాబాద్, మొగుడంపల్లి, కోహీర్ మండలాల్లో ఆత్యల్ప ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. శుక్రవారం రాష్ట్రంలోనే న్యాల్‌కల్‌లో 7.9 డిగ్రీల రెండో అత్యల్ప ఉష్ణోగ్రత నమోదైంది. కోహీర్‌లో 9.2 డిగ్రీలు, జహీరాబాద్ మండలం సత్వార్‌లో 9.3 డిగ్రీలు, మొగుడంపల్లిలో 9.8 డిగ్రీలు, జహీరాబాద్ మండలం మల్చల్మలో 10.1 డిగ్రీలు, ఆల్గోల్‌లో 11.2 డిగ్రీలు, జహీరాబాద్‌లో 12.3 డిగ్రీల కనిష్ట ఉష్ణోగ్రత నమోదైంది. చలికి ప్రజలు గజగజ వణికిపోతున్నారు. ఉదయం 9 గంటల వరకు చలి తీవ్రత తగ్గడం లేదు. ఉదయం పూట కూలీ పనులకు వెళ్లే కార్మికులు, రైతులు, కార్మికులు, ఉద్యోగులు, విద్యార్థులు చలితో వణుకుతున్నారు. చలినుంచి రక్షణకు ఉన్ని దుస్తులు ధరిస్తున్నారు. చలి మంటలు కాచుకుంటున్నారు. ఉదయం 8గంటల వరకు సూర్యుడు రావడం లేదు. సాయంత్రం 6 గంటల్లోపే ఇండ్లలోకి జారుకుంటున్నారు. చిన్నారులు, వృద్ధులు, ఆస్తమా రోగులు చలితో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. చలి తీవ్రత పెరగడంతో ముంబయి–హైదరాబాద్, జహీరాబాద్–ఝరాసంగం, కోహీర్, తాండూర్, వికారాబాద్, బీదర్–జహీరాబాద్, అల్లాదుర్గం, న్యాల్‌కల్–బీదర్, నారాయణఖేడ్‌కు వెళ్లే ప్రధాన రోడ్లు రాత్రివేళ 7గంటలకే నిర్మానుష్యంగా మారిపోతున్నాయి. స్వెటర్లు, జర్కిన్, మఫ్లర్లు, మంకీ క్యాప్‌లు, ఉన్ని దుస్తులు, చేతులకు గ్లౌజులు, కాళ్లకు సాక్స్‌లు ధరిస్తున్నారు. చలి తీవ్రత పెరిగిన నేపథ్యంలో వృద్ధులు, చిన్నారులు, బాలింతలు, గర్భిణులు తగు ఆరోగ్య జాగ్రత్తలు పాటించాలని వైద్యులు సూచిస్తున్నారు.

న్యాల్‌కల్‌లో చలి మంట కాచుకుంటున్న యువకులు